# మాతృసప్తకం

క్రొత్త పెళ్ళికొడుకు రామకృష్ణకు, మామగారు జగన్నాథంగారికి మధ్య చిన్నసైజు గలాటా ఒకటి జరిగింది.

అప్పటికి సుమిత్ర తన శాయశక్తులా ఆ వాగ్వాదాన్ని తుద ముట్టించడానికి ప్రయత్నించింది. కొంతసేపు ఆమె కళ్ళతోనే రామకృష్ణను వారించింది. భ్రుకుటిని కుంచించి ఈ గొడవంతా తనకిష్టం లేనట్టు కాసేపు భర్తకు పెడముఖంగా నిల్చుంది. ఇంతచేసీ అతడు తన సంజ్ఞను అర్థం చేసుకోకపోయేసరికి వెనుక నుంచీ అతని చొక్కా కాలరును లాగి చూచిందిగూడా! ఉఁహూ, లాభంలేక పోయింది. రామకృష్ణ పంతమే రామకృష్ణది. అతడు పరేంగితాన్ని గ్రహించే స్థితిలో లేడు!

సుమిత్ర మనోరంగంపైన ఓ భయవీచిక విసురుగా పారాడింది. చిన్న చిన్న విషయాలకంతా యింత పట్టింపైతే, ఈయనతో వేగడమెలాగబ్బా! పైగా యిది ఈయనకు సంబంధించిన విషయం గూడా గాకపోయె! అమ్మో, తనిన్ని రోజులుగా పసిగట్టలేక పోయింది గానీ ఈయన గారిలో కలహశీలత్వం కాస్తా ఎక్కువ మోతాదులోనే వున్నట్టుంది!

సుమిత్ర రామకృష్ణను సౌమ్యుడనే భావించింది. పరిచయం యీనాటిది గాదు రెండేళ్ళపాటు లెక్చరరు రామకృష్ణ దగ్గర చదువుకున్న విద్యార్థిని సుమిత్ర, చదవడంకన్నా రామకృష్ణను గురించిన ఆలోచలే ఎక్కువ కావడం వల్ల ఆమె ఇంటరు పరీక్షలో ఫెయిలయింది. ఇక ఇంట్లో కూర్చుని, ప్రత్యేకంగా పరీక్షకు గట్టి, మళ్ళీ పాఠ్య గ్రంథాలతో ఘర్షణ పడడంకన్నా పెళ్ళి చేసుకోవడమే మంచి పనిలా తోచింది సుమిత్రకు! జగన్నాథంగారు పుత్రికాజీవి. వెంటనే ఆయన కుమార్తె యింగితాన్ని కనిపెట్టేశాడు. వివాహమూ జరిగిపోయింది.

ఇదంతా పూర్వగాథ,

"మీరు నా మాటను కాస్తా మన్నించాలి. దీనివల్ల మీకు ఖర్చయేది చాలా తక్కువ. అది మీకొక లెక్కలోనిది గాదు. మరి ఇదంటేనా ఓ కుర్రాడి జీవితానికి సంబంధించిన విషయం. మీరు ఒక మాటలో కొట్టిపారేయగూడదూ..." అని ప్రాధేయపడ్డాడు రామకృష్ణ

"ఇదిగో అబ్బాయ్, ఈ తనకుమాలిన ధర్మాలంటే నాకు తగని చిరాకు. ఇదివరకూ ఒకటి రెండుసార్లు నేనిలాటి కుర్రాళ్ళను ఇంట్లో తిరగనిచ్చి టోపీలో పడ్డాను. నాకింతకన్నా నొక్కి చెప్పడం అనవసరం!"

జగన్నాథంగారు పేపరు చూచుకుంటూ వాలు కుర్చీలో నిశ్చలంగా కూర్చున్నారు. రామకృష్ణ సుమిత్రవైపోసారి చూచి మళ్ళీ తల దించుకున్నాడు. ఈ పేచీకి కారణ భూతుడైన కుర్రవాడు మాత్రం గోడకు చేరగిలబడి నిల్చున్నవాడు నిల్చున్నట్టుగానే విగ్రహమైపోయి కనుపాపల్ని మాత్రం ఒకరిపై నుంచీ మరొకరిపైకి త్రిప్పుతున్నాడు.

నాలుగైదు నిమిషాలు యిలా మౌనంగా గడిచిపోయిన తర్వాత జగన్నాథంగారు చేతనున్న పత్రికను టేబిలుపైకి విసిరారు. ఈ వ్యవధిలో ఆయన కాస్త మెత్తబడ్డారు

కూడానేమో. ముఖకవళికల్లో ఏదో ప్రసన్నతా, అనునయ భావమూ గోచరించాయి. ఆయన ఈసారి చాలా సున్నితంగా ప్రారంభించారు–

"ఇక్కడెవరైనా నన్ను అపార్థం చేసుకోవడానికి వీలుందనుకో రామకృష్ణ! నువ్వుకూడా నన్ను లుబ్ధుడి ననుకోవచ్చు. కాని అలా భావించినట్టయితే నువ్వు తీవ్రంగా పొరబడుతున్నావని మాత్రం హెచ్చరించక తప్పదు. తీరా అమ్మాయి పెళ్ళి తలపెట్టుకున్న తర్వాత టౌనుహాలు కట్టడానికి చందా వేయమన్నారు. కళ్ళు మూసుకుని రెండువందలా యాభై రూపాయలు వేయడం జరిగింది. అంతకుమునుపు అదేదో నాటక సమాజం వాళ్ళు చీకి కంపల్లా తగులుకుని పాతిక రూపాయల టిక్కెట్టు కొనుక్కునేదాకా వదలిపెట్టారు గాదు. పైగా మన వ్యాపారంలో లాభం వచ్చిన ప్రతి రూపాయకూ, ఒక కానీ దానధర్మాలకు వినియోగింప బడాలన్నది కచ్చితంగా అమల్లో వున్న నిర్ణయం..."

"అలాగే ఈ అబ్బాయికి గూడా అయిదో పదో యిచ్చి పంపివేయగూడదా నాన్నా?" అంటూ సుమిత్ర యిక్కడ తండ్రికి అడ్డు తగిలి మధ్యవర్తిత్వం నెరపింది.

జగన్నాథంగారు ఆశ్చర్యంగా కుమార్తెవైపు చూచారు. ఆమె సమయస్ఫూర్తికి మెచ్చుకుంటున్నట్లు తల వూపుతూ "ఆఁ! అలాగన్నావు బాగుంది. ఆ వూహ నాకు తట్టింది గాదు, రామకృష్ణకూ తట్టింది గాదు" అని తనతో బాటు, అల్లుణ్ణిగూడా కుమార్తె ఎదుట కించపరచి ఆ తరువాత జేబులో నుంచి పర్సు పైకి తీశారు.

అంతవరకు అప్రతిభుడై నిల్చున్న కుర్రాడిలో యిప్పుడు కదలిక ప్రారంభమైనది. అతడు చేతులు జోడించి "మన్నించండిసార్! నాకిప్పుడు డబ్బుతో అవసరం లేదు. మీ దగ్గరే వుంచండి..." అంటూ రివ్వున బయటికి వెళ్ళిపోయాడు. జగన్నాథంగారు తెల్లబోయారు. సుమిత్ర ముఖం మంచుదెబ్బ తిన్న తామర పువ్వులా ముకుళించుకు పోయింది. ఇందుకు వ్యతిరిక్తంగా రామకృష్ణ ముఖంలో వెలుగు రేఖలు తెరలు తెరలుగా వ్యాపించాయి.

దెబ్బతిన్న తర్వాత చెంపను తడుపుకున్నట్టుగా "పైగా అదొకటి! దొరికిన దానితో తృప్తిపడే రకం గాదు వీళ్ళు..." అన్నారు జగన్నాథంగారు.

రామకృష్ణ గంభీరంగా నవ్వాడు. నవ్వుతూ "అలా తృప్తిపడేవాడైతే ఆ కుర్రాడు స్వగ్రామాన్ని విడిచిపెట్టి చదువుకోసం యింతదూరం వచ్చేవాడు కాదేమో!" అన్నాడు.

❋ ❋ ❋ ❋

పై సంఘటన జరిగిన తర్వాత నాలుగైదు రోజులకు రామకృష్ణ భార్యా సమేతంగా దేశయాత్రకు బయల్దేరాడు.

బహుశా హనీమూన్ లాంటి విలాసయాత్ర కాబోలు – అనుకున్నారు జగన్నాథంగారు.

సుమిత్రకు మాత్రం అయోమయంగా వుంది. ఆమె "ఎక్కడికో చెప్పగూడదటండీ?" అని ప్రశ్నించింది.

"తినబోతూ రుచులడగడ మెందుకూ! బయల్దేరు, బయల్దేరు...' అన్నాడు రామకృష్ణ.

కూతురికి, అల్లుడికీ వీడ్కోలివ్వడానికి జగన్నాథంగారు రైల్వేస్టేషనుకు వచ్చారు.

మాటి మాటికీ అల్లుణ్ణి తర్కించి అడగడానికి మనస్కరించడం లేదు. జగన్నాథంగారికి. ఐనా మనసుండక రైలు కదలబోతుండగా "యింతకూ వెళ్తున్న దెక్కడికో చెప్పలేదే!" అన్నారు.

"మొదటి మకాం కాళహస్తండీ!" అన్నాడు రామకృష్ణ.

రైలు కదిలింది.

"కాళహస్తిలో ఎవరున్నారు? అన్నాడు జగన్నాథంగారు.

రామకృష్ణ కిటికీలోనుంచి వెలుపలికి చూస్తూ "తెలిసిన వాళ్ళున్నారు" అన్నాడు.

జగన్నాథంగారు లోలోపల మండిపడ్డారు – తెలిసిన వాళ్ళట! ఎవరువాళ్ళు? ఎవరైతేనేం, వాళ్ళు కూడా యితగాడికి తోడుబోయిన వాళ్ళుగానే వుంటారు! అసలు ఆదినుంచీ యితడి వాలకమే అదో రకంగా వుంది. ఇతని వ్యక్తిత్వంలో నుంచీ ఆ లెక్చరరు హోదాను మైనస్ చేస్తే మిగిలింది గుండుసున్నేనేమో ననిపిస్తుంది! ఇల్లు లేదు, వాకిలి లేదు, నా అన్నవాళ్ళు లేరు. వెనుకటి కెవరో రాజుగారు తెల్లవారగానే మున్ముందుగా కోటలో ప్రవేశించిన వాడికి కూతురునిచ్చి పెళ్ళి చేసేయాలన్న నిర్ణయానికి వచ్చారట! అలా కోటలో అడుగు పెట్టినవాడు ఓ బైరాగి ముండావాడట! గత్యంతరమేముంది! కుంజరయూథంబు దోమ కుత్తుక సొచ్చింది! లేక లేక ఒక్క కూతురు కదా, ఆమె ముద్దూ ముచ్చటా తీర్చడం తన బాధ్యత గదా అనుకుంటే, ఈమె చూచి చూచీ యితగాణ్నే వరించాలా? ఏమిటో అంతా విధి విధానం...

జగన్నాథంగారు కారు వెనుక సీటులో కూలబడి తలుపు దభీమని వేసుకున్నారు.

అక్కడ పరుగెడుతున్న రైల్లో సుమిత్రగూడా ఆలోచిస్తోంది.

'ఈయనతో మరీ ముసుగులో గుద్దులాటయిపోతోంది. స్పష్టంగా వ్యవహరించడం చేతకాదల్లే వుంది మనిషికి! పలానా చోటికి వెళ్తున్నాము, అక్కడ పలానా వాళ్ళున్నారని చెబితే ఈయన గౌరవానికి హాని వస్తుందేమో! ఐనా యింత బింకమెందుకో! నాన్నగారే మనుకున్నారో మరి!...'

సుమిత్ర రామకృష్ణవైపు చూచింది. ఒకరి ఆలోచనలతో తనకేమీ సంబంధము లేదన్నట్లు అతడు సూట్‌కేసుకు ఆనుకుని వారపత్రిక చదువుకుంటున్నాడు.

సుమిత్ర ఆలోచనలీసారి సూట్‌కేసుపైకి ప్రవహించాయి.

నిన్నటి ఉదయం తొమ్మిది గంటలకనగా బజారుకు వెళ్ళి దీన్ని కొనుక్కుని ఈయన పదకొండు గంటలకు యింటికి తిరిగొచ్చారు. ఎందుకండీ అంటే ప్రయాణానికన్నారు. ఆయనలా బయటికి వెళ్ళగానే తమ పెట్టె తెరచిచూచింది. పెట్టెలో ఏడు కొత్త చీరలున్నాయి. లేలేత అరిటాకులాంటి సేత. అన్నీ చేనేత చీరలే. మళ్ళీ వాటికి తగిన రవిక గుడ్డలు గూడా! చూచిన కొద్దీ యింకా చూడాలనే బుద్ధయింది. ఆ చీరలు ఎవరికోసం వుద్దేశించబడ్డాయో తెలుసుకోవాలన్న కుతూహలమైతే తనకెంతో వుంది. కానీ అడిగితే సరైన జవాబు వస్తుందన్న నమ్మకమేమిటి? పోనీలే, ఆయన చెప్పకపోతారా అని తను వూరుకుంది కాని ఏదీ, ఆయన మాటల్లో ఆ చీరల ప్రస్తావనే రాదే!...

ఆయన సైకాలజీ లెక్చరర్ అయిపోయారమ్మా మరీనూ! అందుకేగావును కడుపులో....

❀ ❀ ❀ ❀

సుమిత్రను వెంటబెట్టుకుని రామకృష్ణ పానగల్లు రాజవీధి గుండా నడువసాగాడు. వెనువెంట కుర్రాడొకడు ట్రంకూ, పరువూ తీసుకొస్తున్నాడు. "ఐతే వెళ్ళినంత దూరం యిలా నడిచి వెళ్ళవలసిందేనటండీ!" అంది సుమిత్ర.

"ఎందుకూ! ఇక్కడే కృష్ణామెటల్ ఫ్యాక్టరీకి నాలుగో యింట్లోనే సుబ్బరామయ్యగారి నివాసం..." అన్నాడు రామకృష్ణ.

సుమిత్రను మూడంకణాల పెంకుటింటి ఎదుట వసారాలో నిల్చోబెట్టి రామకృష్ణ లోపలికి వెళ్ళాడు. అడుగులు సవ్వడి విని "ఎవరు బాబూ?" అంటూ ఓ ముత్తయిదువ వంటగదిలోనుంచి ఈవలికి వచ్చింది.

"బాగున్నావా పెద్దమ్మా" అన్నాడు రామకృష్ణ.

"నువ్వా నాయనా! ఇదేనా రావడం? కూర్చో కూర్చో. పెళ్ళిపత్రిక వచ్చింది. రావాలనుకున్నాం కాని ప్రయాణం కుదిరిందికాదు..." కట్టెలు తెంచుకున్న సంబరంలో గుక్క త్రిప్పుకోకుండా మాట్లాడుకపోతూంది ఆ ముత్తయిదువ.

"నేనొక్కణ్ణేగాదు పెద్దమ్మా! కోడల్ని గూడా తీసుకొచ్చాను..." అన్నాడు రామకృష్ణ.

"ఏదీ, ఎక్కడ! మంచిపని చేశావులే నాయనా! అమ్మాయిని వసారాలో నిల్చోబెట్టేశావన్న మాట! రామ్మా లోపలికిరా" అంటూ ఆవిడ సుమిత్రను సాదరంగా ఆహ్వానించింది.

రామకృష్ణ కుర్చీలో కూర్చున్నాడు. సుమిత్ర చాపపైన కూర్చుంది. డబ్బులు తీసుకుని కుర్రాడు వెళ్ళిపోయాడు.

చుట్టాలొచ్చిన ఉత్సాహంలో గృహిణికి ఏం చేయడానికీ పాలుపోవడం లేదు. ఆమె ఒకటి రెండుసార్లు వంటగదిలోకి వెళ్ళింది. మళ్ళీ బయటికి వచ్చి ఏదో కావలసి వున్నట్టు పెరట్లోకి వెళ్ళింది. అంతలో తిరిగివచ్చి వీధి గడపలో నిల్చుని ప్రక్క యింటి కుర్రాణ్ణి పిలిచింది.

"ఏం కావాలి పెద్దమ్మా?" అన్నాడు రామకృష్ణ.

"కుర్రాణ్ణి బజారుకు పంపిద్దామని–"

"ఏం కావాలో నాతో చెప్పగూడదూ?"

పెద్దమ్మ కాసేపు తటపటాయించి "కాఫీపొడి అయిపోయింది బాబూ" అంది.

"ఆ మాత్రానికి ప్రక్క యింటి కుర్రాడెందుకు! క్షణంలో వస్తాను" అంటూ రామకృష్ణ చరచరా బజారువైపు వెళ్ళిపోయాడు.

అతడు తిరిగి వచ్చేసరికి పెద్దమ్మ సుమిత్రను మాటల్లోకి దింపగలిగింది.

"అదేమిటి నాయనా! నువ్విలా తయారౌతావని నే నేనాడూ అనుకోలేదే! బొత్తిగా మనసిచ్చి మాట్లాడకపోతే అమ్మాయి దిగులుపడిపోదూ! తీరా యిక్కడికి వచ్చేదాకా ఎక్కడికి వెళ్తున్నదీ తెలియదట్నే అమ్మాయికి!!"

"ఇది మరీ బాగుంది పెద్దమ్మా! సుమిత్రకెలాగూ అత్తగారు లేకపోయారు. కోడంటికం బాధ కాస్త చవిచూపిద్దామని యిక్కడికి పిలుచుకొస్తే మీరత్తా కోడళ్ళు ఒకటై పోయారన్నమాట?" రామకృష్ణ బిగ్గరగా నవ్వేశాడు. అతడితోబాటు సుమిత్ర, పెద్దమ్మగూడా నవ్వేశారు.

మధ్యాహ్నం భోజనానికి సుబ్బరామయ్యగారు యింటికి వచ్చారు.

రామకృష్ణను చూడగానే ఆయనకు ప్రాణం లేచి వచ్చినట్టయింది. భోజనానంతరం ఆఫీసుకు సెలవు చీటీ వ్రాసి పంపి రామకృష్ణ దగ్గర పూర్వస్మృతులు నెమరువేసుకుంటూ కూర్చున్నారు. సుమిత్రగూడా సాయం చేయడంవల్ల పెద్దమ్మ సాయంత్రం ఆరుగంటలకల్లా వంట ముగించింది. అందరూ కలసి దేవాలయానికి వెళ్లారు. ఆరోజు శుక్రవారం, బంగారు చీరలో జ్ఞానప్రసూనాంబిక ముసిముసి నవ్వులు నవ్వుతోంది. గుడినుంచి వెలుపలికి వచ్చేసరికి చల్లగా వెన్నెలగూడా వచ్చింది. పిచ్చాపాటి మాట్లాడుకుంటూ నలుగురూ స్వర్ణముఖి యిసుకతిన్నెల పైన కూర్చున్నారు. వెన్నెల కొండకోనల మీద, గోపుర కలశాల మీద, ఏటిలో నీటి పాయల మీద తళ తళా మెరసిపోతూంది.

“ఎలా వుందమ్మా మా వూరు” అన్నారు సుబ్బరామయ్యగారు సుమిత్ర కేసి చూస్తూ.

“బాగుందండీ! చాలా బాగుంది!” అంది సుమిత్ర.

“బాగుందని నువ్విక్కడే క్యాంపు వేయాలని చూస్తున్నావల్లే వుంది. అదేం జరగదు. రేపు తెల్లవారే ప్రయాణం” అన్నాడు రామకృష్ణ.

“అదేమిటయ్యా! ఏం తొందర? నాలుగు రోజులుండి పోగూడదూ? సెలవులింకా వున్నాయిగా...” అన్నారు సుబ్బరామయ్యగారు.

“సెలవులున్నాయనుకోండి! కానీ యింకా చాలా చోట్లకు వెళ్ళాలి. వెంకటగిరిలో పరంధామయ్యగారున్నారు. గూడూరులో శేషాచలంగారిని చూడాలి. అలాగే నెల్లూరికి వెళ్ళాలి...” అన్నాడు రామకృష్ణ.

మరునాటి వుదయం ప్రయాణానికి ముందుగా రామకృష్ణ సూట్‌కేసి తెరచి ఓ చీరా, రవికా పైకి తీశాడు. వాటిని పెద్దమ్మ చేతికిచ్చి సాష్టాంగపడి నమస్కరించాడు.

భర్తను అనుకరించడం వినా మరేం చేయాలో తోచలేదు సుమిత్రకు!

“ఇవన్నీ ఎందుకు నాయనా! నువ్వు మమ్మల్ని మరచిపోలేదు. మాకంతే చాలు!” అంది చెమరించిన కళ్ళను చీర చెరుగుతో తుడుచుకుంటూ పెద్దమ్మ.

“ఇది మీరు మమ్మల్ని మరచిపోకుండా వుండడానికే పెద్దమ్మా! మరోకందుకు గాదు. దగ్గర్లోనే వున్నాం గనుక అప్పుడప్పుడు వస్తుంటాము. ఇప్పటికి సెలవిప్పించండి...” అన్నాడు రామకృష్ణ.

సుబ్బరామయ్యగారు స్టేషనుకు వచ్చి సతీపతుల్ని రైలెక్కించాడు.

వెంకటగిరిలో పరంధామయ్యగారు బహు కుటుంబీకులు. ఆయన భార్య పార్వతమ్మ రామకృష్ణకు పిన్ని వరుస. కుటుంబం పెద్దదైనా పొలాలపైన మంచి ఆదాయం వస్తుంది. పెద్దమేడ, వంటలక్క, రేడియో మొదలైన హంగులన్నీ వున్నాయి. రామకృష్ణ ఎంత పట్టుబట్టినా పార్వతమ్మ పిన్ని దగ్గర సాగింది కాదు. “కొత్త పెళ్ళికొడుకువి! కోడల్ని తీసుకొచ్చావు. నాలుగు రోజులుండి పోకపోతే అదేం మర్యాద! ఉహు, ససేమిరా వీల్లేదు” అంటూ ఆమె గిరిగీచేసింది. ఆ యింట్లో ఆమెది సుగ్రీవాజ్ఞ! రామకృష్ణ నాలుగైదు రోజులు వెంకటగిరిలో వుండిపోయాడు.

మళ్ళీ అక్కడ నుంచీ బయల్దేరినప్పుడు గూడా ఆ యింటి యిల్లాలిని సత్కరించడానికి మరచిపోలేదు. పార్వతమ్మకు చీరలకు కొదువ లేదు. ఐనా ఆమె ఈ చిన్ని కానుకను

స్వీకరిస్తూ మురిసిపోయింది. జన్మతహా కాస్తా ఆవేశస్వభావమేమో, ఆమె సుమిత్రను దగ్గరకు తీసుకొని "చిట్టి తల్లీ! రామకృష్ణ చాలా మంచివాడు. అంత మంచివాడు గనుకనే నీలాటి యిల్లాలు దొరికింది. మీరు పై సంవత్సరం వేసవి సెలవుల్లో తప్పకుండా రావాలి. అప్పటికి మీరు ఇద్దరుగా వస్తే నేనొప్పుకోను. మనుమణ్ణి మరచిపోకండి..." అని దీవించింది.

పది పదిహేను రోజులు తర్వాత దంపతులు తిరుగు ప్రయాణం చేస్తున్నారు రాత్రివేళ మాట్లాడినంతసేపు మాట్లాడి ప్రయాణీకులు నిద్రమత్తులో జోగుతున్నారు. వాళ్ళ మాటలు వాటితో కలిసి వినవచ్చిన రైలు చక్రాల చప్పుడు – ఈ శబ్ద సమ్మేళనాన్ని జోలపాటక్రింద స్వీకరించి సుమిత్ర కాసేపు కునుకు దీసింది. హఠాత్తుగా ఆమె మేలుకునేసరికి రైలు పంట పొలాలమధ్య పరుగెడుతోంది. రామకృష్ణ కిటికీలో నుంచి నిశా సౌందర్యాన్ని ఆవలోకిస్తున్నాడు.

"ఇంకా రెండు చీరలు మిగిలిపోయాయి గదండీ!" అంది సుమిత్ర సంభాషణకు ఉపక్రమిస్తూ.

"అవును సుమిత్రా! మానవుడికి మంచి వూహ కలిగితే మాత్రం చాలదు. ఆ వూహ సఫలం కావడానికి అవసరమైన అనుకూల పరిస్థితులు కూడా చేయి దాటి పోకుండా వుండాలి."

సుమిత్ర కర్థం కావడంలేదు.

"అవును సుమిత్రా మనం అయిదుచోట్లకు వెళ్ళాము. మిగిలిన రెండుచోట్లకూ వెళ్ళలేకపోయాము. శేషమ్మవ్వ బొంబాయిలో వుందట. అక్కడ ఆమె కుమారుడు వుద్యోగంలో వున్నాడు. అప్పటికీ ఆవిడే కాస్తానయం. మా రాజేశ్వరి వదిన రాష్ట్రాన్ని, దేశాన్నేగాక లోకాన్నే విడిచిపెట్టిందని మొన్ననే తెలిసింది..."

ఒక క్షణం ఆగి మళ్ళీ ప్రారంభించాడు రామకృష్ణ. "సహనానికి పర్యాయ పదమేమిటని నువ్వడుగుతావనుకో సుమిత్రా, నేను రాజేశ్వరి వదిన అని చెబుతాను. ఇంటి నిండా బిడ్డలు తన సిగరెట్లపద్దుకు, టిఫిను ఖర్చులకూ పోనూ మిగిలిన జీతాన్ని తెచ్చి భర్త ఆమె దోసిట్లో పారేసేవాడు. ఆ డబ్బును చేత బట్టుకొని రాజేశ్వరి వదిన ఎంత గుంభనంగా సాగించేది సంసారం! స్వయంగా తనే బజారుకు వెళ్ళి బియ్యం తెచ్చుకునేది. కట్టెలు తెచ్చుకునేది. బిడ్డలకు జబ్బుచేస్తే తనే హాస్పిటలుకు వెళ్ళేదిగూడా. ఆమె కష్టాలన్నిటినీ కళ్ళతోచూస్తూ గూడా నేను ప్రతి ఆదివారమూ ఆమెకు అతిథిగా దాపురించేవాణ్ణి. తను తినకుండా మిగిలించిన అన్నాన్ని నాకు పెట్టి ఆమె పస్తుండిన రోజులెన్నో నేను చెప్పలేను... తెల్లబోయి చూస్తున్నావేం సుమిత్రా! తెలియడం లేదూ, యిదంతా ఒక వారాలబ్బాయి స్వీయ చరిత్ర..."

"ఏమిటీ?" విస్మయంతో ప్రశ్నించింది సుమిత్ర.

"నిజం! చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. పంతులుగారి యింట్లో వుండి ఆయన చెప్పినపని చేస్తూ అయిదో తరగతి వరకూ చదువుకున్నాను. జీవకారుణ్య సంఘంలో ఉచిత భోజన సౌకర్యాలున్నాయని చెప్పి పట్టణానికి పంపారు పంతులుగారు. అక్కడికి వెళ్ళి వాకబు చేసేసరికి అలాంటి సంఘంలేదని తెలిసింది. హెడ్మాస్టరు గారిని

చూచాను. 'కావలిస్తే ఫీజు లేకుండా చూస్తాను వారాలు ఏర్పాటు చేసుకోమన్నా'రాయన. శ్రీ కంఠంగారు అప్పుడు హైస్కూల్లో లెక్కలమేష్టారు. ఆర్జన తక్కువైనా ఆయన ఉదారులు. ఇంటికి తీసుకెళ్ళారు. ఆయన భార్య వారంలో ఒక్కరోజు భోజనం పెట్టడానికి సమ్మతించింది. శ్రీకంఠం మేష్టరుగారే నన్ను పరంధామయ్యగారింటికి తీసుకెళ్ళారు. పరంధామయ్యగారక్కడ తాశీల్దారుగా వుండే వారు. ఇటు మేష్టరుగారు, అటు తాశీల్దారుగారు నాపట్ల శ్రద్ధ వహించడంవల్ల ఏడు రోజులు భోజనపుటేర్పాట్లు కుదిరాయి. ఓరోజు సుబ్బరామయ్యగారిల్లు; ఆయన మునిసిపాటీలో వుద్యోగి. మరో రోజు శేషాచలంగారిల్లు. ఆయన డిస్ట్రిక్టు కోర్టులో ట్రాన్సులేటరు, ఆరేళ్ళ హైస్కూలు చదువూ యిలా జరిగిపోయింది. డబ్బులేని వాడికి వున్నత విద్య అందని మ్రానిపండే! కానీ దిక్కులేనివాడికి 'బాబూ! నువ్వు తిన్నావా, లేదా? అనగలిగేపాటి ఆత్మీయత అంతకన్నా గగనకుసుమం. పెద్దమ్మ, పార్వతమ్మ, రాజేశ్వరి వదిన వీళ్ళందరూ ఆ లోటును కొంతవరకూ భర్తీ చేయగలిగారు. వాళ్ళు నాకు జీవితపథంలో ఒకచోట తారసిల్లారు. నేనొక మనిషిగా తయారుకావడానికి తోడ్పడ్డారు. వాళ్ళ ఉపకృతికి ప్రత్యుపకృతి చేయడం నాచేత సాధ్యంకాని పని అని నాకు తెలుసు. కానీ మన చేతిలోని పని గనుక కృతజ్ఞతకలిగి వుండవచ్చును గదా!'

❁ ❁ ❁ ❁

కొత్త కాపురం. ఓరోజు మధ్యాహ్నం కాలేజీనుంచి యింటికి వచ్చాడు రామకృష్ణ.

"ఏమండీ! మీకు చెప్పకుండా నేనొక పనిచేశాను." అంది సుమిత్ర.

"మంచిపనే గదా! ఐతే సంతోషమే" అన్నాడు రామకృష్ణ.

"అదేపని అని అడిగితే ముత్యాలు రాలిపోతాయటండీ?"

"అభ్యంతరం లేకపోతే చెప్పుమరి!"

"ఆరోజు మా యింటికొచ్చిన కుర్రాడు, జ్ఞాపకముంది కదూ–వాడీరోజు వీధిలో వెళ్తూ కనిపించాడు..."

"... ... ... ..."

"పిలిచి ఎక్కడ భోజనం చేస్తున్నావబ్బాయ్! అని అడిగాను. "ఇంకా ఎక్కడా కుదరలేదండీ! వాళ్ళూ వీళ్ళూ సహాయం చేస్తామని చెబుతున్నారు" అన్నాడు.

"అందుకు నువ్వేమన్నావు?"

"ఆ ఏర్పాట్లేవో కుదిరేదాకా మన యింటికి రమ్మన్నాను."

రామకృష్ణ భార్యను సరసకు తీసుకుంటూ "నువ్వు జగన్నాథంగారి అమ్మాయివే సుమిత్రా! కానీ రామకృష్ణ భార్యవనిగూడా ఋజువు చేసుకో గలిగావు" అన్నాడు.

♦ *ఆంధ్ర వారపత్రిక, 1954* ♦